సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న వజ్రేష్‌యాదవ్‌

మేడ్చల్‌: మున్సిపాలిటీ పరిధిలో వివిధ వార్డులకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను నియోజకవర్గ కాంగ్రెస్‌ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్‌ పంపిణీ చేశారు. మున్సిపాలిటీకి చెందిన కృష్ణప్రియకు రూ.60వేలు, నరేందర్‌గౌడ్‌కు రూ.60 వేలు మంజూరు కావడంతో ఆ చెక్కులను వజ్రేష్‌యాదవ్‌ తన నివాసంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు మహేష్‌, సత్యనారాయణ, రాకేష్‌, సంతోష్‌గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ సదస్సుకు బోగారం వాసి



మల్లికార్జున్‌రెడ్డి

కీసర: బోగారం గ్రామానికి చెందిన ప్రొఫెసర్‌ రాగి మల్లికార్జున్‌రెడ్డి ఈ నెల 9న యూఎస్‌లో జరగనున్న 'అమెరికన్‌ జియోఫిజికల్‌ యూనియన్‌' అంతర్జాతీయ సదస్సులో పాల్గొనున్నారు. కాకతీయ వర్సిటీలో జియాలజీ విభాగం అధిపతిగా పనిచేస్తున్న మల్లిఖార్జున రెడ్డి వాషింగ్టన్‌ డీసీలో జరగనున్న సదస్సులో జియాలజీకి సంబంధించిన పలు అంశాలపై పరిశోధన పత్రాలను సమర్పిస్తారు. ఈ సందర్భంగా ఆయనను గ్రామస్తులు అభినందించారు.

వైభవంగా చండీహోమం



కీసర: రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్‌ ఉత్తర్వుల మేరకు ప్రజాపాలన ఉత్సవాల సందర్భంగా శనివారం కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వరస్వామి దేవస్థానం నందు చండీహోమంను అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్‌ తటాకం నాగలింగం, ఈఓ సుధాకర్‌రెడ్డి, అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ప్రజాపాలన విజయోత్సవాలు



కిట్స్‌ పంపిణీ చేస్తున్న మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ ప్రణీతాగౌడ్‌ తదితరులు

కీసర: ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమంలో భాగంగా శనివారం దమ్మాయిగూడ మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికులకు కిట్స్‌ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ ప్రణీతాగౌడ్‌ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో వైస్‌ చైర్మన్‌ మాదిరెడ్డి నరేందర్‌రెడ్డి, కమిషనర్‌ నాగమణి, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభకు తరలివెళ్లిన బీజేపీ నేతలు



కీసర: కాంగ్రెస్‌ ఏడాదిపాలన వైఫల్యాలపై నగరంలోని బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బహిరంగ సభకు నాగారం మున్సిపల్‌ చైర్మన్‌ కౌకుట్లచంద్రారెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున బీజేపీ నేతలు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అధ్యక్షుడు వేణుగోపాల్‌, కౌన్సిలర్లు లక్ష్మీ, బిజ్జశ్రీనివాస్‌గౌడ్‌, రవీందర్‌రెడ్డి, కిషోర్‌గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్‌ ప్రోగ్రాం



మేడ్చల్‌రూరల్‌: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని నర్సింహ్మారెడ్డి ఇంజనీరింగ్‌ కళాశాలలో ఏఐసీటీఈ మరియు అటల్‌ వారి సహకారంతో వారం రోజుల పాటు జరిగిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్‌ ప్రోగ్రాం శనివారం ముగిసింది. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి త్రిశూల్‌రెడ్డి, డైరెక్టర్‌ మోహన్‌, ట్రెజరర్‌ త్రిలోక్‌రెడ్డి, ప్రిన్సిపాల్‌ లోకనాథం, పురుషోత్తం, రాము, దిలీప్‌రెడ్డి, శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్య షష్ఠి

మేడ్చల్‌రూరల్‌: గుండ్లపోచంపల్లి, మేడ్చల్‌ మున్సిపాలిటీలతో పాటు మండలంలోని గ్రామాల్లో సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూడూర్‌ గ్రామంలోని అయ్యప్ప దేవాలయంలో సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా ఆలయధర్మకర్త మల్లారెడ్డి గురుస్వామి ఆధ్వర్యంలో అర్చకులు సుబ్రహ్మణ్యస్వామి వారికి అభిషేకాలు, అర్చనలు, విశేష పూజలు నిర్వహించారు.

ఆర్థిక ఇబ్బందులతో క్యాబ్‌ డ్రైవర్‌ మృతి



శ్రీనివాస్‌రావు (ఫైల్‌)

పోచారం: ఆర్థిక ఇబ్బందులతో క్యాబ్‌ డ్రైవర్‌ మృతి చెందిన ఘటన పోచారం పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని విజయనగరం జిల్లాకు చెందిన చెల్లూరి శ్రీనివాస్‌రావు (25) పోచారంలో దుర్గాప్రసాద్‌, నవీన్‌లతో కలిసి అద్దె ఇంట్లో ఉంటూ క్యాబ్‌ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం సమయంలో కుటుంబ సభ్యులతో వాట్సాప్‌ గ్రూప్‌లో మాట్లాడుతూ.. జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకుంటున్నట్లు చెప్పాడు. వెంటనే అతని సోదరుడు వెంకటరమణ పోలీసులకు, ఇంటి యజమానికి సమాచారం అందజేశాడు. ఈ నేపథ్యంలో వారు వచ్చేలోపే ఉరి వేసుకుని శ్రీనివాస్‌ ఆత్మహత్య చేసుకున్నాడు. సోదరుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మేడ్చల్‌రూరల్‌: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మేడ్చల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం అర్ధరాత్రి 44వ జాతీయ రహదారిపై పట్టణంలోని క్లాసిక్‌ దాబా సమీపంలో గుర్తుతెలియని వాహనం బైక్‌ను ఢీ కొట్టింది. ఘటనలో బైక్‌పై ఉన్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు సుచిత్రలోని బ్యాంక్‌ కాలనీకి చెందిన రవితేజ (35)గా పోలీసులు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

ప్రభుత్వాసుపత్రికి మహర్దశ

220 పడకలకు మల్కాజిగిరి ఆసుపత్రి అప్‌గ్రేడ్‌

- మెడికల్‌ కాలేజీకి అనుబంధంగా వసతులు
- డయాగ్నస్టిక్‌ హబ్‌, రేడియాలజీ ల్యాబ్‌



మల్కాజిగిరి ప్రభుత్వ జనరల్‌ ఆసుపత్రి

సాక్షి,సిటీబ్యూరో: మల్కాజిగిరి ప్రభుత్వ జనరల్‌ ఆసుపత్రికి మంచిరోజులు వస్తున్నట్లు కనిపిస్తోంది. ఈసీఐఎల్‌లోని కుత్బుల్లాపూర్‌ ప్రభుత్వ మెడికల్‌ కాలేజీకి అనుబంధంగా ప్రభుత్వ ఆసుపత్రిని మార్చడంతో మహర్దశ కలిగినట్టైంది. మేడ్చల్‌, మల్కాజిగిరి జిల్లా ప్రజలకు వైద్యసేవలు మరింతగా పెరగనున్నాయి.

వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి..

ప్రభుత్వ ఆదేశాల మేరకు మేడ్చల్‌, మల్కాజిగిరి జిల్లా వైద్యారోగ్యశాఖ ఆసుపత్రిలో పడకల సంఖ్యను పెంచడంతో పాటు దానికి తగ్గట్టుగా అన్నీ వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది. మల్కాజిగిరి ప్రభుత్వ కేంద్ర ఆసుపత్రిలో ప్రస్తుతం 70 పడకలు ఉండగా.. ఆ సంఖ్యను 220 పడకలకు పెంచారు.

అదనపు సిబ్బంది నియామకం..

మల్కాజిగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో పెరిగిన పడకల సంఖ్యకు అనుగుణంగా ఇప్పటికే 94 మంది డాక్టర్లను నియమించారు. ఇందులో మెడికల్‌ కాలేజీకి సంబంధించిన డాక్టర్లు 49 మంది ఉండగా.. వైద్యారోగ్యశాఖ డాక్టర్లు 45 మంది ఉన్నారు. దీనికి తగ్గట్టుగా స్టాఫ్‌ నర్సులను కూడా నియమించేందుకు చర్యలు తీసుకుంటోంది. ప్రస్తుతం మల్కాజిగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో స్టాఫ్‌ నర్సుల సంఖ్య 30 ఉండగా.. ఆ సంఖ్యను 100కు పైగా పెంచేందుకు వైద్యారోగ్యశాఖ కసరత్తు చేస్తోంది.

ప్రజలకు అందుబాటులో మరిన్ని సేవలు..

ప్రభుత్వ మెడికల్‌ కాలేజీలో అనాటమీ, బయోకెమిస్ట్రీ, ఫిజియాలజీ, సైకాలజీ ,పాథాలజీ, మైక్రోబయాలజీ, గైనకాలజీ , పీడియాట్రిక్స్‌, జనరల్‌ సర్జన్‌, మెడిసిన్‌, సైకాలజీ, అర్థోపెటిక్‌, ఈఎన్టీ, అప్తమాలజీ, రేడియాలజీ డిపార్ట్‌మెంట్లు ఉండటంతో దీనికి సంబంధించిన విభాగాలు మల్కాజిగిరి జనరల్‌ ప్రభుత్వాసుపత్రిలో ఏర్పాటుకానుండటంతో ప్రజలకు మరిన్ని వైద్య సేవలు అందనున్నాయి.

అదనపు పరికరాలతో పెరగనున్న వసతులు..

డయాగ్నస్టిక్‌హబ్‌తో పాటు రేడియాలజీకి సంబంధించిన విభాగాలు కూడా త్వరలో ఆసుపత్రికి రానున్నాయి. మరో రెండేళ్లలో మల్కాజిగిరి ప్రభుత్వాసుపత్రిలో డాక్టర్ల సంఖ్యతో పాటు వైద్యసేవల పరంగా మరిన్ని వసతులు ఏర్పడే అవకాశం ఉన్నట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. అవసరమైన సదుపాయాలతో పాటు కావాల్సిన పరికరాలు, పారామెడికల్‌, వైద్య సిబ్బంది సంఖ్య కూడా పెంచనున్నారు.

అల్వాల్‌ సూపర్‌ స్పెషల్‌ ఆసుపత్రితో..

నియోజకవర్గ పరిధిలోని అల్వాల్‌లో నిర్మిస్తున్న టిమ్స్‌ (సూపర్‌ స్పెషాలిటీ ప్రభుత్వాసుపత్రి) పూర్తైతే మేడ్చల్‌, మల్కాజిగిరి జిల్లా ప్రజలకు సముచిత స్థాయిలో వైద్యసేవలు అందించగలమని, ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి.



ప్రభుత్వ ఆసుపత్రుల్లో పెరిగిన వైద్యసేవలు

మేడ్చల్‌, మల్కాజిగిరి జిల్లాలో ఇప్పటికే ప్రైవేట్‌రంగంలో 7 మెడికల్‌ కాలేజీలు ఉన్నాయి. ఈసీఐఎల్‌లో ప్రభుత్వ మెడికల్‌ కాలేజీ ఏర్పాటుతో జిల్లా ప్రజలకు వైద్యసేవలు మరింత పెరిగే అవకాశం ఉంది.

– డా. రఘునాథ్‌స్వామి, డీఎంహెచ్‌ఓ

మూడు సీహెచ్‌సీలు..

మేడ్చల్‌, మల్కాజిగిరి జిల్లాలో ఘట్కేసర్‌, మేడ్చల్‌, శామీర్‌పేట్‌లో కమ్యూనిటీ హెల్త్‌ సెంటర్‌ (సీహెచ్‌సీ)లు, 28 యూపీహెచ్‌పీసీలు, 12 పీహెచ్‌పీలు, 112 బస్తీ దవాఖానాలు, 69 పల్లె దవాఖానాలు ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్నాయి. ఉప్పల్‌, మల్కాజిగిరి, మేడ్చల్‌, కీసర, జవహర్‌నగర్‌, అల్వాల్‌, బాలానగర్‌, మల్లాపూర్‌, షాపూర్‌ నగర్‌లోని ఆరోగ్యకేంద్రాల్లో ప్రజలకు 24 గంటల వైద్యసేవలు అందిస్తున్నట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ పేర్కొంటుంది.

- నారపల్లి ,కుషాయిగూడ, ఎంసీపల్లి, కుత్బుల్లాపూర్‌, దుండిగల్‌, పర్వతానగర్‌, వెంకట్‌రెడ్డినగర్‌ ఆరోగ్య కేంద్రాల్లో ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు గర్భిణులకు ప్రసవాలను నిర్వహిస్తున్నట్లు వైద్యశాఖ తెలిపింది.
- ఈసీఐఎల్‌ మెడికల్‌ కాలేజీకి అనుబంధంగా ప్రభుత్వ నర్సింగ్‌ కళాశాల ఏర్పాటు చేశారు. జిల్లాలో బస్తీ,పల్లె దవాఖానాలు, సీహెచ్‌పీలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు వైద్యశాఖ సేవలందిస్తోంది.

వ్యాపారాలు రైతు బజారులో ఏర్పాటు చేసుకోవాలి



రోడ్డుపై పర్యటిస్తున్న అధికారులు

మేడ్చల్‌: ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా పట్టణంలో ప్రధాన రోడ్లపై వీధి వ్యాపారాలు చేస్తున్న చిరు వ్యాపారులు తమ వ్యాపారాలను పట్టణంలోని రైతు బజారులోకి మార్చుకోవాలని మేడ్చల్‌ ట్రాఫిక్‌ ఏసీపీ వెంకట్‌రెడ్డి కోరారు. పట్టణంలోని మార్కెట్‌ రోడ్డును ఆయన మున్సిపల్‌ కమిషనర్‌ నాగిరెడ్డి, ట్రాఫిక్‌ సీఐ హనుమాన్‌గౌడ్‌లతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తుమ్మ చెరువు నుంచి జాతీయ రహదారి వరకు ఉన్న రోడ్డులో అండర్‌గ్రౌండ్‌ పైప్‌లైన్‌ పనులు చేపడుతున్నందున మార్కెట్‌ రోడుల్లో రద్దీ పెరుగుతుందని, చిరు వ్యాపారులు తమ దుకాణాలను రైతు బజారులోకి మార్చుకోవాలని సూచించారు. రోడ్డుపై ఉన్న ఆక్రమణలను తొలగించాలని సూచించారు. పర్యటనలో పట్టణ మాజీ ఉపసర్పంచ్‌ నర్సింహారెడ్డి, కౌన్సిలర్‌ మర్రి శ్రీనివాస్‌రెడ్డి, డీఈ విజయలక్ష్మీ తదితరులు ఉన్నారు.

డబుల్‌బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారుల ధర్నా



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న డబుల్‌బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులు

కీసర: కీసర డబుల్‌బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులు శనివారం కీసర తహసీల్దార్‌ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. తమకు గత ఏడాదిన్నర క్రితం అధికారులు, పాలకులు కీసరలో నిర్మించిన డబుల్‌బెడ్‌రూం ఇళ్లను కేటాయించారని, ఇళ్ల కేటాయింపు సమయంలో తమకు అందజేయాల్సిన పట్టాలను ఇప్పటివరకు అందజేయకపోవడంతో ఇబ్బందులు పడాల్సివస్తుందన్నారు. ఇటీవల విద్యుత్‌ అధికారులు తమ గృహసముదాయాల వద్దకు వచ్చారని, ఇళ్ల మంజూరు పత్రాల కాపీలను తమకు చూపిస్తేనే విద్యుత్‌ అందిస్తామంటున్నారని, లేకుంటే విద్యుత్‌ సరఫరాను తొలగిస్తామంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే సౌకర్యాలు లేక నానా అవస్థలు పడుతున్న తమకు విద్యుత్‌ సరఫరా కూడా నిలిచిపోతే ఎలా అని వాపోయారు. తమ సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్‌ అశోక్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. బీజేపీ నేత నల్ల వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంఘీభావం కోసం రాలేదు..

సమస్య పరిష్కారం కోసం వచ్చాను



దీక్షాస్థలంలో మాట్లాడుతున్న ఎంపీ ఈటెల

ఘట్‌కేసర్‌: తెలంగాణలో ఆర్థిక పరిస్థితి దిగజారిపోయిందని, అభివృద్ధి పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిలుల్లు చెల్లించలేని దుస్థితి నెలకొందని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటెల రాజేందర్‌ అన్నారు. జేఏసీ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు హనుమాన్‌, రమేష్‌, నరేష్‌ముదిరాజ్‌, ఉదయ్‌, ప్రతాపరెడ్డి తదితరులు చేపట్టిన రైల్వే వంతెన రిలే నిరహార దీక్ష స్థలాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా నిమ్మరసం అందజేసి దీక్షను విరమింపజేశారు. అనంతరం ఎంపీ ఈటెల మాట్లాడుతూ.. దీక్షలకు సంఘీభావం తెలపడానికి, విమర్శలు చేయడానికి రాలేదని, స్థానిక ఎంపీగా సమస్యను పరిష్కరించడానికి వచ్చానన్నారు. ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి వంతెన నిర్మాణం పూర్తి అయ్యేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్‌ లక్ష్మారెడ్డి, ఎఫ్‌ఎస్‌సీఎస్‌ చైర్మన్‌ రాంరెడ్డి, డైరెక్టర్‌ లక్ష్మారెడ్డి, మాజీ చైర్మన్‌ శ్రీనివాస్‌గౌడ్‌, మాజీ ఎంపీపీలు సుదర్శన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్‌, కౌన్సిలర్‌ నర్సింగ్‌రావు, నాయకులు లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు



జవహర్‌నగర్‌: జవహర్‌నగర్‌ కార్పొరేషన్‌ పరిధిలోని సీఆర్‌పీఎఫ్‌ స్కూల్‌ విద్యార్థులు తెలంగాణ రాష్ట్రం నుంచి జాతీయ స్థాయి త్రోబాల్‌ పోటీలకు ఎంపికయ్యారు. శనివారం పాఠశాల ప్రిన్సిపాల్‌ అపర్ణ, ఫిజికల్‌ డైరెక్టర్‌ రాజశేఖర్‌ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులు నవతేజ, రిత్విక్‌, దేవానంద్‌సాగర్‌, మాధవి భరత్‌, లాస్యప్రియ, శివసాగర్‌లను అభినందించారు. ఈ నెల 9న మధ్యప్రదేశ్‌ రాష్ట్రంలోని ఇండోర్‌లో జరిగే జాతీయస్థాయి త్రోబాల్‌ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో హరిశంకర్‌, వెంకటరాజు, కిషోర్‌, గోపాలకృష్ణ, చంద్రశేఖర్‌, నయీమ్‌, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఆరుగురు అదృశ్యం

తల్లితో సహా పిల్లలు అదృశ్యం



వెంకటలక్ష్మీ, పిల్లలు రాజేశ్వరి, రాహుల్‌ (ఫైల్‌)

జవహర్‌నగర్‌: తల్లితో సహా పిల్లలు అదృశ్యమైన ఘటన జవహర్‌నగర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. జవహర్‌నగర్‌ కార్పొరేషన్‌ సంతోష్‌నగర్‌లో నివసించే బత్తుల శ్రీకాంత్‌ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శ్రీకాంత్‌కు భార్య వెంకటలక్ష్మీ (33), కూతురు రాజేశ్వరి (11), కుమారుడు రాహుల్‌ (6)తో కలిసి ఉంటున్నాడు. అయితే భార్య వెంకటలక్ష్మీ ఆరోగ్యం బాగాలేదని తరచూ శ్రీకాంత్‌ మందలించేవాడు. మనస్థాపం చెందిన వెంకటలక్ష్మీ ఈ నెల 4న ఎవరికీ చెప్పకుండా ఇద్దరు పిల్లలతో కలిసి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. వారి ఆచూకీ కోసం ఎంత వెతికినా ఫలితం లేకపోవడంతో భర్త శ్రీకాంత్‌ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యం



సంధ్యారాణి (ఫైల్‌)

జవహర్‌నగర్‌ కార్పొరేషన్‌ మహంకాళీ దేవాలయం సమీపంలో నివసించే మామిండ్ల సాయికుమార్‌, భార్య సుజాత, ఇద్దరు పిల్లలతో ఉంటున్నారు. పెద్ద కుమార్తె సంధ్యారాణి (22) బోడుప్పల్‌లో నివసించే మధును ప్రేమించి నవంబర్‌ 5న ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. తిరిగి మరలా 15న ఇంటికి తిరిగివచ్చింది. ఈ నెల 7న సరుకుల కోసం కిరాణాషాపుకి సంధ్యారాణి, తన సోదరి శ్రీలత వెళ్లారు. డబ్బులు తీసుకురావడానికి సంధ్యారాణి తన సోదరిని ఇంటికి పంపించగా తిరిగి వచ్చేసరికి సంధ్యారాణి కనిపించలేదు. ఆమె ఆచూకీ కోసం ఎంత వెతికినా లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

ఇద్దరు మైనర్‌ బాలికలు అదృశ్యం

ఘట్‌కేసర్‌: ఘట్‌కేసర్‌ పీఎస్‌ పరిధిలో ఇద్దరు మైనర్‌ బాలికలు అదృశ్యమయ్యారు. ఇన్‌స్పెక్టర్‌ పరశురాం తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపాలిటీలోని వేర్వేరు కాలనీలకు చెందిన ఇద్దరు మైనర్‌ (17) బాలికలు పట్టణంలోని ఓ దుకాణంలో పని చేస్తున్నారు. పని చేయడానికి రోజు వెళ్లిన విధంగానే శుక్రవారం ఉదయం ఇంటి నుంచి దుకాణానికి వెళ్లారు. తిరిగి సాయంత్రం వారు ఇంటికి చేరుకోలేదు. దీంతో ఆందోళనకు గురైన బాలికల కుటుంబీకులు బంధువుల ఇంటి వద్ద, చుట్టుపక్కన ఎంత వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. బాలికల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు మిస్సింగ్‌ కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో బాలికల ఆచూకీ కోసం పోలీసులు ప్రత్యేక బృందాలను నియమించారు.

వైభవంగా సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి





విగ్రహ ప్రతిష్ఠాపనలో.. మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

మేడ్చల్‌రూరల్‌: మేడ్చల్‌ మున్సిపాలిటీ పరిధి పూడూర్‌ గ్రామంలో నూతనంగా నిర్మించిన సాయిబాబా ఆలయంలో సాయినాథుని విగ్రహ ప్రతిష్ఠ శనివారం ఘనంగా జరిగింది. విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో అర్చకులు గణపతి శర్మ ఆధ్వర్యంలో గురువారం సాయిబాబా ఊరేగింపు, ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం ఆలయ చైర్మన్‌ వెంకటరమణరెడ్డి దంపతులు హోమాలు, పూజలు నిర్వహించారు. శనివారం 8.45 గంటలకు వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించగా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు.

పాల్గొన్న ఎమ్మెల్యే..

విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో మేడ్చల్‌ ఎమ్మెల్యే మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, సాయిగీత ఆశ్రమం వ్యవస్థాపకులు సాయికుమార్‌ బాబా, మేడ్చల్‌ ఇన్‌స్పెక్టర్‌ సత్యనారాయణ, ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ హనుమాన్‌గౌడ్‌, మున్సిపల్‌ బీఆర్‌ఎస్‌ పార్టీ అధ్యక్షులు, మాజీ జిల్లా గ్రంథాలయాల చైర్మన్‌ భాస్కర్‌ యాదవ్‌, మండల పార్టీ అధ్యక్షులు దయానంద్‌ యాదవ్‌, మాజీ సర్పంచ్‌ బాబుయాదవ్‌, మద్దుల శ్రీనివాస్‌రెడ్డి, జగన్‌రెడ్డి, మాజీ మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ సత్యనారాయణ పాల్గొని ప్రత్యేక పూజలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారిని ఆలయ చైర్మన్‌ వెంకట రమణారెడ్డి సత్కరించారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



తోటకూర వజ్రేష్‌యాదవ్‌ను కలిసిన కాంగ్రెస్‌ అధ్యక్షుడు నల్లరాల అఖిలేష్‌రెడ్డి తదితరులు

కీసర: కాంగ్రెస్‌పార్టీ యువజన విభాగం ఎన్నికల్లో నాగారం మున్సిపల్‌ యూత్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడిగా గెలుపొందిన నల్లరాల అఖిలేష్‌రెడ్డితోపాటు, కీసర మండల యూత్‌ కాంగ్రెస్‌ ఉపాధ్యక్షులు సింగిరెడ్డి అకిలాష్‌రెడ్డి, మేడ్చల్‌ జిల్లా జనరల్‌ సెక్రెటరీ అరవింద్‌ శనివారం టీపీసీసీ ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్‌యాదవ్‌, మేడ్చల్‌జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, మేడ్చల్‌ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, బొడుప్పల్‌ మేయర్‌ అజయ్‌యాదవ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను పెద్ద ఎత్తున ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో శివరాంరెడ్డి, రాహుల్‌యాదవ్‌, కార్తీక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.